క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం: మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పుష్యమాసం మూడవ శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

డ్రైవర్లకు కంటి చూపు ప్రధానం


చికిత్స చేయించుకుంటున్న ఆర్టీవో

ప్రొద్దుటూరు క్రైం: డ్రైవర్లకు కంటి చూపు ప్రధానమని ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న డ్రైవర్లు, ఇతర సిబ్బందికి కడప పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. 65 మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. చిన్నపాటి దృష్టి లోపం ఉన్నా నిర్లక్ష్యం వహించకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి, ఎంవీఐలు నారాయణనాయక్, హేమకుమార్, రవీంద్రనాయక్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతిని ఫ్రీజోన్ చేయాలి

ప్రొద్దుటూరు: రాష్ట్ర రాజధాని అమరావతిని ఫ్రీజోన్ చేసి రాజధానిలో చేపట్టే ఉద్యోగాలలో అన్ని ప్రాంతాలవారికి సమానావకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ పేర్కొన్నారు. స్థానిక పెన్నా నగర్ సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా మహా సభల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25, 26వ తేదీల్లో బద్వేల్‌లో నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న మూడు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు శరత్‌కుమార్, దస్తగిరి, చాంద్‌బాషా, రాజ, మహేశ్వర్, రమేష్ పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాలి


ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు: జిల్లాలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని శనివారం ఎమ్మెల్యే గృహంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉక్కుఫ్యాక్టరీ నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ఒత్తిడి తేవాలని కోరారు. ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తే ఎంతోమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ విషయమై సీఎంతో ఓ ప్రకటన చేయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సమితి సభ్యులు శ్రీను, చంద్రశేఖర్, మద్దిలేటి, మీరావలి, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

20న 'చలో కర్నూలు'


మాట్లాడుతున్న బి.ఓబయ్య

అట్లూరు: రాజ్యాంగాన్ని కాపాడుకుందాం – దేశాన్ని రక్షించుకుందాం అనే నినాదంతో ఈ నెల 20వ తేదీన సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో కర్నూలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ బి.ఓబయ్య, జిల్లా నాయకులు ఎస్.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం బద్వేలు పట్టణంలోని బైపాస్‌రోడ్డులోని వారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగం ఆమోదింపబడి 75 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటికీ పేదల తలరాతలు ఏమాత్రం మారలేదని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను అతికొద్ది కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టి దేశాన్ని అప్పులపాలు చేస్తోందని విమర్శించారు. జకరయ్య, రామరాజు, సంజీవ్, బాబు, విజయరావు, జయపాల్ పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపు

- 2024 జనవరి నుంచి మంజూరు కాని వైనం
- ప్రభుత్వం పట్టించుకోవాలని బాధితుల విజ్ఞప్తి


కలసపాడు మండలంలో వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

కలసపాడు: ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరీల్లో 20 వేల మందికి పైగా వృద్ధాప్య పింఛన్లు రాకుండా ఉన్నారు. 2024 జనవరి నుంచి నవంబర్ వరకు భర్త చనిపోయిన మహిళలకు వితంతు పింఛన్ ఇవ్వని కూటమి ప్రభుత్వం.. డిసెంబర్‌లో మాత్రం వితంతువులైన మహిళలకు పింఛన్ ఇచ్చింది. ఇదెక్కడి న్యాయమంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు. ముందు భర్త చనిపోయిన ఒంటరిగా మారిన తమకు పింఛన్లు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం నెల కిందట వితంతువులైన మహిళలకు పింఛన్లు ఇవ్వడం దారుణమని వారు వాపోతున్నారు. నవంబరు నెలలో కూటమి ప్రభుత్వం భర్త చనిపోయిన మహిళలకు మరుసటి నెలలో పింఛన్ అందజేస్తామని సర్క్యులర్ జారీ చేసింది. ఈ జీవో 1 నుంచి 15వ తేదీలోపు వృద్ధాప్య పింఛన్ తీసుకునే భర్త మరణిస్తే మరుసటి నెలకే ఆ మహిళకు వితంతు పింఛన్ మంజూరు చేస్తుంది. 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మరణిస్తే తదుపరి నెల కాకుండా ఒక నెల విడిచి మరో నెలలో పింఛన్ ఇస్తుంది. ఈ లెక్కన రాష్ట్ర వ్యాప్తంగా 1 నుంచి 15వ తేదీలోపు చనిపోయిన వృద్ధాప్య పింఛన్‌దారుల భార్యలు 5400 మందికి పైగా వితంతు పింఛన్లు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 400 మంది వారిలో ఉన్నారు. 16 నుంచి 30వ తేదీ వరకు ఇదే సంఖ్య ఉండవచ్చు. ఈ లెక్కన నెలకు దాదాపు 800 మంది వరకు వితంతు పింఛన్ పొందనున్నారు.

ఏడాదైనా మేము కనిపించలేదా?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదట్లో ప్రతి నెల నూతన పింఛన్లు మంజూరు చేసేది. తదుపరి కార్య నిర్వహణపరంగా ఇబ్బంది రావడంతో ఆరు నెలలకు ఒకసారి అంటే జనవరి నుంచి జూన్ వరకు, జూలై నుంచి డిసెంబర్ వరకు నూతన సామాజిక పింఛన్లు మంజూరు చేసేది. ఈ పద్ధతిలో 2023 డిసెంబర్ వరకు అందిన దరఖాస్తులకు పింఛన్లు మంజూరు చేసేవారు. తదుపరి ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం 2024 మే నెలలో బాధ్యతలు చేపట్టింది. ఆరు నెలలకొకసారి పింఛన్లు మంజూరవుతాయని ఆశగా ఎదురుచూసిన పేదలకు వాటి ఊసే కూటమి ప్రభుత్వం ఎత్తడం లేదు. ప్రతి నెల పింఛన్ల విషయంలో వాయిదా వేసుకుంటూ వస్తున్నారు. తీరా డిసెంబర్ వచ్చేసరికి వృద్ధాప్య పింఛన్ పొందుతూ చనిపోయిన వారి భార్యలకే పింఛన్ అంటూ జీవో జారీ చేశారు. అలాగే ఇతర ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో వితంతువులుగా మారిన మహిళలు ఏడాది కాలంలో కనీసం 3 నుంచి 4 వేల వరకు ఉండవచ్చు. వీరందరూ వితంతు పింఛన్ కోసం ఎదురుచూస్తున్నా ఫలితం మాత్రం లేదు.

వృద్ధాప్య పింఛన్ ఊసే లేదు

60 సంవత్సరాలు దాటిన వారంతా వృద్ధాప్య పింఛన్ పొందేందుకు అర్హులు. ఇలాంటి వారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 వేల మందికి పైగా ఉంటారని అంచనా. నెలకు రూ.4 వేలు పింఛన్ అందిస్తున్నామని ఆర్భాటంగా చెప్పిన కూటమి ప్రభుత్వం ఏడాదికి కూడా కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంపై అర్హులు మండిపడుతున్నారు. తమకు రూ.4 వేలు పింఛన్ అందితే వృద్ధాప్యంలో ఔషధాల ఖర్చుకు, ఇతర అవసరాలకు అందుతాయని ఆశగా ఎదురుచూస్తున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. పత్రికల్లో కూటమి నాయకుల ప్రకటనలు చూసి.. సచివాలయం వద్దకు వెళ్లడం, సిబ్బందిని అడగడం, వారు దరఖాస్తుకు ప్రభుత్వం కల్పించలేదని చెప్పడం సరిపోతోంది.

సచివాలయ ఉద్యోగులను నిలదీస్తున్న వైనం

మాకు సంవత్సరం నుంచి పింఛన్ రాకున్నా ఇటీవల నెలలోపు భర్త చనిపోయిన మహిళలకు పింఛన్ ఎలా ఇస్తారని సచివాలయ ఉద్యోగులను వితంతువులు నిలదీస్తున్నారు. వారి వద్ద మీరేమైనా డబ్బు తీసుకుని వారికి పింఛన్ ఇస్తున్నారా అంటూ పింఛన్ పంపిణీ ఉద్యోగిపై కేకలు వేస్తున్నారు. ప్రభుత్వం ఇలా ఉత్తర్వులు ఇచ్చిందని చెప్పినా ఆ మహిళ వినలేదు. ఈ విషయంపై ధర్నా చేస్తామంటూ బెదిరించింది. చివరికి విషయం తెలిసిన గ్రామంలోని పెద్దలు సర్దిచెప్పి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఆ మహిళ ఇదేమి తెలివితక్కువ నిర్ణయమంటూ.. పింఛన్ కోసం ఎదురుచూస్తున్న నాకు ఇవ్వకుండా నెల కూడా గడువు దాటని ఆమెకు పింఛన్ ఎలా ఇచ్చారని లబోదిబోమని వాపోయింది. ఇది జిల్లాలోని ఓ మండలంలోని ఓ సచివాలయంలో జరిగిన సంఘటన.

దివ్యాంగుల పింఛన్లలోనూ అంతే..

నాలుగు నెలల క్రిందట జిల్లాలో 3400 వికలాంగుల పింఛన్లు ప్రభుత్వం రీ వెరిఫికేషన్ చేసింది. వీరు ఆసుపత్రికి వెళ్లి పునఃపరిశీలన చేసుకోవాలని నోటీసులు అందజేశారు. మొదటి నెలలో దాదాపు 1100 మంది వరకు పునఃపరిశీలనకు వెళ్లగా అర్హులకు పింఛన్ నిలుపుదల చేశారు. మిగిలిన 2 వేల మంది పునఃపరిశీలనకు వెళ్ళకున్నా మరో నెల రూ.6 వేలు పింఛన్ అందజేశారు. పరిశీలనలకు వెళ్లిన వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిశీలనకు వెళ్లిన వారికి కాకుండా వెళ్లని వారికి మరో నెల పింఛన్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

పింఛన్ ఎప్పుడిస్తారు



నా భర్త చనిపోయి ఆరు నెలలపైగా అయింది. ఇప్పటికీ పింఛన్ అందడం లేదు. పలుమార్లు సచివాలయ సిబ్బందిని అడిగినా ప్రభుత్వం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వలేదు. ఇస్తేనే దరఖాస్తు చేసి పింఛన్ మంజూరు చేస్తామని చెబుతున్నారు. గత నెలలో వృద్ధాప్య పింఛన్ తెచ్చుకుంటూ ఒకరు చనిపోతే భార్యకు వెంటనే ఈ నెల పింఛన్ వచ్చింది. నాకు మాత్రం ఇప్పటికీ రాలేదు.
– కారుబాలసుబ్బమ్మ, తోకలపల్లె, పోరుమామిళ్ల మండలం

9 నెలలైనా ఇవ్వలేదు



నా భర్త 9 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇప్పుడు ఒక నెల క్రితం చనిపోయిన వారి భార్యలకు పింఛన్ ఇస్తున్నారు. 9 నెలలు అవుతున్నా నాకు పింఛన్ రావడం లేదు. నాకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయాలి.
–పాలకొలను తిరుమలమ్మ, సిద్దమూర్తిపల్లె, కలసపాడు మండలం

కోత మొదలైంది!

- దివ్యాంగ పింఛన్లు తొలగించేందుకు 'కూటమి' కుట్ర
- మండల పరిధిలో పింఛన్ వెరిఫికేషన్


వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కాశినాయన: కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లకు ఎసరు పెడుతుంది. నడవలేని స్థితిలో ఉండి మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. ఇటీవల అందుకు సంబంధించి కడప రిమ్స్ వైద్యాధికారులతో దివ్యాంగులకు స్క్రీనింగ్ టెస్టులు చేశారు. ఈ నేపథ్యంలోనే శనివారం మండలంలో మంచానికే పరిమితమైన 16 మంది లబ్ధిదారులను రిమ్స్ వైద్యులు డాక్టర్ మహిధర్‌రెడ్డి, ఉజ్వల, మండల వైద్యాధికారి డాక్టర్ పుష్ప ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. అర్హులైన వారిని నిర్ధారించి వైద్యులు వారికి తిరిగి వికలాంగత్వ సర్టిఫికెట్లను ఇస్తామని అంటున్నారు.

868 మందికి త్వరలో వైద్యపరీక్షలు

మండలంలో 868 మంది పింఛన్‌దారులకు వైద్యపరీక్షలు నిర్వహించాలని శనివారం జిల్లా అధికారుల నుంచి ఎంపీడీఓకు ఆదేశాలు వచ్చాయి. గత నవంబర్‌లో 308 పింఛన్లను తొలగించారు. మండలంలో మంచానికే పరిమితమైన 16 మంది పింఛన్లలో వెరిఫికేషన్‌లో ఎంత మంది అనర్హులు ఉంటారోనని ఆందోళన మొదలైంది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలి


బద్వేలు అర్బన్ : కూరగాయల మార్కెట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు

బద్వేలు అర్బన్: పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పట్టణ ప్రణాళిక అధికారి సతీష్ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని కూరగాయల మార్కెట్, బస్టాండు, ఆర్టీఓ కార్యాలయ పరిసరాల్లో చెత్తను తొలగించడంతో పాటు మెయిన్ రోడ్డులో మానవహారం ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ సుందరీకరణలో ప్రజల సహకారం తప్పనిసరిగా ఉండాలని కోరారు. ప్రజలు, దుకాణదారులు ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు వేయకుండా మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, శానిటేషన్ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పరిసరాల పరిశుభ్రతను ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని ఎంపీడీఓ డి.మల్లేశ్వరి పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని చింతలచెరువు పంచాయతీలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రతిజ్ఞ చేశారు. అలాగే గ్రామంలోని పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

చాపాడులో స్వచ్ఛ ఆంధ్ర

చాపాడు: మండల వ్యాప్తంగా శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వ అధికారులు నిర్వహించారు. మండల కేంద్రమైన చాపాడు, నక్కలదిన్నె గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పిచ్చి మొక్కలు తొలగించి, అపరిశుభ్రతను ఊడ్చివేశారు. అనంతరం వైద్య సిబ్బందితో వైద్యాధికారులు రాజేష్‌కుమార్, శ్రీవాణి, ఓబులేసు, కావ్యమాధురి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఇదే క్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి ఆధ్వర్యంలో అన్ని గ్రామపంచాయతీలలో అపరిశుభ్రత తొలగించారు.

పోలీసుల అక్రమ అరెస్టులు దారుణం


పోలీస్ స్టేషన్‌లో గోసా మనోహర్

ప్రొద్దుటూరు: పోలీసులు తమను అక్రమంగా శనివారం తెల్లవారు జామున అరెస్టు చేసి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించడం దారుణమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్ పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా సంఘాల గొంతు నొక్కుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్, ఎస్సీలకు ప్రత్యేక బడ్జెట్ అంటూ హామీలిచ్చినా ఆచరణపెట్టలేదన్నారు. ఎస్సీ వర్గీకరణపై మాలమాదిగల మధ్య గొడవలు సృష్టించి ఓట్లు దండుకున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా అనేక సంక్షేమ పథకాలు చేపడతానని చెప్పి ఓట్లు వేయించుకుని అధికారం చేపట్టిన తరువాత మరచిపోయారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అంబేడ్కర్ పేరు చెప్పడంతోపాటు ఎస్సీ, ఎస్టీ యువతకు రూ.5 నుంచి రూ.10 లక్షలు లోన్ ఇచ్చి బాగు పరుస్తామని చెప్పి తమను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ముఖ్యమంత్రి వస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు, మాలమహానాడు నాయకులను అరెస్టుచేయడం తగదన్నారు.

'కూటమి' హామీలు అమలు చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఆయా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.గంగాసురేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో వలంటరీ వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక దానిని గాలికొదిలేశారని అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పాలకులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ నెల 25, 26వ తేదీల్లో బద్వేలు పట్టణంలో జరగనున్న ఏఐవైఎఫ్ జిల్లా 15వ మహాసభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శరత్, పట్టణ నాయకులు మల్లేష్, హరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలి



బహిరంగ లేఖ చూపుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఓ బహిరంగ లేఖలో డిమాండ్ చేశారు. కేసీ కెనాల్ చివరి ఆయకట్టు స్థిరీకరణ, గాలేరు–నగరి, తెలుగుగంగ, హంద్రీ నీవా రెండో దశ పనులు చేపట్టాలన్నారు. పంటకాల్వల నిర్మాణం పూర్తి చేయాలని, సోమశిల భూ నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని, శ్రీశైలం కనీస నీటిమట్టం 854 అడుగులు ఉండేలా చూడాలని కోరారు. ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్, ఏపీజీబీ ప్రధాన కార్యాలయాలను కడపలో కొనసాగించాలన్నారు. ఆర్టీపీపీ నిర్మాణంలో భూ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించి, పులివెందుల మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు నిర్వహించాలన్నారు. పోరుమామిళ్ల మండలం తిరుపతిరెడ్డి కాలనీ, బద్వేల్ మండలం భగత్‌సింగ్ నగర్, సిఆర్.నగర్(సి.కొత్తపల్లె), వాకరాపేట సీపీఐ కాలనీ, గోపవరం మండలం పీపీ.కుంట కాలనీ ప్రజలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వీసీ క్రిష్టారెడ్డిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, కేసీ.బాదుల్లా పాల్గొన్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

పోరుమామిళ్ల: కడప జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ కోరారు. శనివారం జిల్లా అభివృద్ధిపై సీపీఎం నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా భైరవప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. పంటకాలువల్లో పూడిక తీయాలన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. పోరుమామిళ్ల మండలంలో పేపర్ మిల్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, బీబీ, మల్లేష్ పాల్గొన్నారు.

పరామర్శ


ఎంపీటీసీని పరామర్శిస్తున్న డీసీ.గోవిందరెడ్డి

పోరుమామిళ్ల: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎంపీటీసీ విజయకుమారి కుమారుడు రాఘవ, మాజీ వార్డు మెంబర్ కూల్‌డ్రింక్ షాపు బాబు మృతి చెందారు. అయితే విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శనివారం మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసార ఇచ్చారు. ఎమ్మెల్సీ వెంట వైస్ ఎంపీపీ సీఎం బాషా, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నరసింహులు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు రాజీవ్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి నారాయణరెడ్డి, ఎంపీటీసీ ఇస్సాక్, సాయి నారాయణరెడ్డి, నాయకులు మణి, గురప్ప, గౌస్, రామకృష్ణ, సయ్యద్ పాల్గొన్నారు.

మాధవరెడ్డి మృతి బాధాకరం


మాధవరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : ఎస్‌బీఐ మేనేజర్‌గా దీర్ఘకాలం సేవలందించి పేదల, రైతుల అభ్యున్నతికి కృషి చేసిన పెద్దిరెడ్డి మాధవరెడ్డి మృతి బాధాకరమని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గుండెపోటుతో మృతి చెందిన మాధవరెడ్డి భౌతికకాయాన్ని శనివారం ఆయన నివాసంలో పరామర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మంచితనానికి మారుపేరుగా నిలిచిన మాధవరెడ్డి మృతి చెందడం ప్రతిఒక్కరిని కలచివేస్తోందని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బోడపాటి రామసుబ్బారెడ్డి, మాజీ ఏపీ ఐవీసీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

20న ప్రత్యేక వ్యాపార దినం

కడప కల్చరల్ : ఎల్ఐసీ జాతీయీకరణ లక్ష్యాలను కొనసాగించే చర్యలను కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి, శ్రామిక మహిళా కన్వీనర్ పి.వసుప్రద ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జనవరి 20న దేశ వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక వ్యాపార దినం జయప్రదం చేయాలని వారు కోరారు.

అంకితభావంతో పనిచేయండి

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి


ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

అట్లూరు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యలపై స్పందిస్తూ పార్టీ పురోభివృద్ధికి అంకితభావంతో పని చేయాలని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన తోట నాగేశ్వర్‌రావు శనివారం పోరుమామిళ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. వివిధ పదవుల్లో నూతనంగా నియమితులైన వారు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని సూచించారు. అనంతరం నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, కౌన్సిలర్ సత్యనారాయణ, వార్డు ఇన్‌చార్జిలు రెడ్డెయ్య, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి సహకారం అందిస్తాం

వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : గ్రామీణ ప్రాంత రైతులు వ్యవసాయంతో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సహకారం అందించాలని ఊటకూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కడప ఊటకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో అన్నమయ్య, వైఎస్సార్ జిల్లా ఏడీఏలకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలైన వరి, నువ్వులు, వేరుశనగ, బొప్పాయి, మామిడి, అరటి పంటల సాగుపై చర్చించారు. వాటికి ఆశించే చీడపీడల నివారణపై అరా తీశారు. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయి పర్యటన నిర్వహిస్తూ పంటలను పరిశీలిస్తున్నారన్నారు. ఆత్మ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ రైతుల ఆర్థికావృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, రైతులకు పంటలసాగుకు తగిన శిక్షణ ఇస్తుందన్నారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయాధికారులు పర్యవేక్షిస్తూ రైతులకు కావాల్సిన సూచనలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఊటకూరు ఏఆర్ఎస్ డీఆర్సీ రమణారెడ్డి, కలికిరి కేవీకే శాస్త్రవేత్త పీరుసాహెబ్, కేవీకే వనిపెంట శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్, కేవీకే, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎల్.నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని హోచిమిన్ భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికులకు అరకొర వేతనాలు ఇచ్చారని, కొన్ని పంచాయతీలలో 10 నుంచి 16 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కొన్ని గ్రామాల్లో వేతనం అడిగితే అసలు మీరు పనే చేయలేదని చెప్పేసి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. చెత్త బండ్ల మరమ్మతులకు డబ్బులివ్వడం లేదని, డ్రస్సులు, మాస్కులు, చెప్పులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ.బాదుల్లా పాల్గొన్నారు.

రేషనలైజేషన్ చట్టబద్ధతకు అసంబద్ధాలు తొలగించండి


సమస్య వివరిస్తున్న పీఎస్‌టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : బదిలీలు, రేషనలైజేషన్ చట్టబద్ధతకు అసంబద్ధాలను తొలగించాలని పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయరెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌జేడీ శామ్యూల్‌ను శనివారం వారు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 117 జీవో ప్రకారం 6, 7, 8వ తరగతుల్లో 94 మంది విద్యార్థులు దాటితే మూడవ సెక్షన్‌గా చేయడంతో వేలాది స్కూల్ అసిస్టెంట్లు సర్ ప్లస్ అవుతారన్నా రు. బదిలీలలో పెర్ఫార్మెన్స్ పాయింట్ల విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీవీ.సుబ్బారెడ్డి, ఎన్వీ.సుబ్బారెడ్డి, సీపీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, మోహన్ రెడ్డి, దిలీప్ కుమార్, నాయమూర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా కొనసాగించండి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ఉర్దూ మీడియం సెక్షన్ పాఠశాలలను కామన్ స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుసంధానం చేసినా.. గతంలో మాదిరిగానే మాదిరిగా ఉర్దూ డీఐ, ఉర్దూ ఏఎంఓల పర్యవేక్షణలో తరగతులు జరిగేలా చూడాలని రూట రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ కోరారు. పాఠశాల విద్య ఆర్‌జేడీ శామ్యూల్‌ను శనివారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. హాజీ అబ్దుల్‌హకీం సాహెబ్, మహమ్మద్ అయ్యబ్, సయ్యద్ సిరాజుద్దీన్, అఫ్జల్ బాషాపాల్గొన్నారు.